నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
8 | నిజామాబాద్, గురువారం 27 ఫిబ్రవరి 2025 | ADILABAD NIRMAL



ఆదిలాబాద్‌లో పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

## సామగ్రి పంపిణీ కేంద్రం సందర్శన

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 26 : నిర్మల్ జిల్లాలో గురువారం నిర్వహించే ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సిబ్బందికి సామగ్రిని పంపిణీ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ అభిలాష అభినవ్ సందర్శించారు. సిబ్బందికి సూచనలు చేశారు. నిర్ణీత సమయానికి అధికారులు కేంద్రాలకు చేరుకుని వసతులను సరి చూడాలన్నారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, అదనపు ఎస్పీ రాజేశ్‌మీనా, ఉపేందర్‌రెడ్డి, ఆర్డీవో రత్న కల్యాణి, కోమల్ రెడ్డి ఉన్నారు.




మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్


# నేడే ఎమ్మెల్సీ సమరం

## రెండు స్థానాల ఎన్నికలకు సర్వం సిద్ధం

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తి
- ఎన్నికల సామగ్రితో కేంద్రాలకు తరలిన అధికారులు
- పైసలు గుప్పించిన ప్రధాన పార్టీల అభ్యర్థులు



ఎన్నికల సామగ్రితో విధులకు వెళ్తున్న ఉద్యోగిని




### ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్

### ఉమ్మడి జిల్లాలో 67,738 మంది పట్టాభద్రులు, 5,512 మంది ఉపాధ్యాయ ఓటర్లు

మంచిర్యాల, ఫిబ్రవరి 26(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణలో రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు నేడు(గురువారం) ఎన్నికలు జరగనున్నాయి. వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ స్థానంతోపాటు మెదక్- నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాలకు పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. కాగా.. ఎన్నికల్లో గెలిచేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయి. మంగళవారం సాయంత్రం 5 గంటలకు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార పర్వం ముగిసింది. దీంతో పోటీలో ఉన్న అభ్యర్థులు ఓటర్లను ప్రలోభపెట్టే పనిలో నిమగ్నమయ్యారు. ఎన్నికలకు ముందు రోజు శివరాత్రి రావడం వారికి కలిసొచ్చింది. బుధవారం రాత్రి మొదలుకుని గురువారం ఉదయానికి ఓటర్లందరినీ చేరుకునేలా వ్యూహాలతో ముందుకు వెళ్తున్నారు. ఓ ప్రధాన జాతీయ పార్టీకి చెందిన అభ్యర్థి రెండు రోజుల ముందే ఓటర్లకు డబ్బులు వచ్చాయి. ఓటకు రూ.2 వేల నుంచి రూ.3 వేల దాకా ముట్టజెప్పారని ఓటర్లు చెప్తున్నారు. ఇక రాష్ట్రంలో అధికారంలో ఉన్న మరో జాతీయ పార్టీకి చెందిన అభ్యర్థి కూడా భారీగా పైసలు గుప్పిస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇక టీచర్ ఎమ్మెల్సీ బరిలో ఉన్న ఓ జాతీయ పార్టీ అభ్యర్థి టీచర్లకు ఏకంగా ఓటుకు రూ.5 వేల చొప్పున ముట్టజెప్పినట్లు తెలిసింది. రాష్ట్ర అధికార పార్టీ సపోర్ట్ ఉన్న అభ్యర్థి టీచర్లకు ఓటుకు రూ.2వేల చొప్పున ఇచ్చినట్లు సమాచారం. చదువుకున్న పట్టభద్రులు, టీచర్లు మాత్రం డబ్బులు తీసుకుని ఎవరికి ఓటు వేయాలో వారికి వేసేందుకు సిద్ధం అవుతున్నారు.

### ఉమ్మడి జిల్లాలో 74,827 ఓటర్లు

మెదక్- నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రుల స్థానం నుంచి టి.జీవన్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా రఘోత్తంరెడ్డిల పదవీకాలం మార్చి 29వ తేదీన ముగియనుంది. ఈ నేపథ్యంలో ఈ స్థానాల్లో ఎన్నికల నిర్వహణకు ఈ నెల 3వ తేదీన ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ కోసం 54 మంది, టీచర్ ఎమ్మెల్సీ కోసం 16 మంది బరిలో నిలిచారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల దాకా పోలింగ్ జరగనుంది. ఇందుకోసం అన్ని జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం సాయంత్రం జిల్లా కేంద్రాల నుంచి ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ బాక్సులతో అధికారులకు పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 69,134 పట్టభద్రుల ఓటర్లు, 5,693 ఉపాధ్యాయ ఓటర్లు మొత్తం 74,827 మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

అత్యధికంగా మంచిర్యాల జిల్లాలో 32,585 మంది ఓటర్లు ఉన్నారు. పట్టభద్రుల ఓటర్ల కోసం 40, ఉపాధ్యాయ ఓటర్ల కోసం 18 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ ఆఫీసర్లు 60, అసిస్టెంట్ పోలింగ్ అధికారులు 181, మైక్రో అబ్జర్వర్లు 25, రూట్ ఆఫీసర్లు 12 మంది మొత్తం 229 మంది అధికారులు ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు.

ఆసిఫాబాద్ జిల్లాలో 6,607 మంది ఓటర్లు ఉండగా 17 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేకించి పట్టభద్రుల కోసం రెండు, టీచర్ల కోసం ఒక పోలింగ్ కేంద్రం కేటాయించారు. మిగిలిన 14 పోలింగ్ స్టేషన్లు కామన్ పోలింగ్ స్టేషన్‌లుగా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ ఆఫీసర్లు 19, అసిస్టెంట్ పోలింగ్ అధికారులు 87, మైక్రో అబ్జర్వర్లు 17 మందిని నియమించారు.

ఆదిలాబాద్ జిల్లాలో 16,528 మంది ఓటర్లు ఉండగా 39 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ ఆఫీసర్లు 46, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు 153, మైక్రో అబ్జర్వర్లు 28, జోనల్ ఆఫీసర్లు 9 మంది ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు.

నిర్మల్ జిల్లాలో 19,107 ఓటర్లు ఉండగా 46 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ ఆఫీసర్లు 37, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు 148, మైక్రో అబ్జర్వర్లు 26 మంది ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు.

## పటిష్ట బందోబస్తు

**ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం**

ఎదులాపురం, ఫిబ్రవరి 26 : ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 400 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. బుధవారం స్థానిక టీటీడీసీలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తయ్యే విధంగా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ యాక్ట్ (సెక్షన్ 144) అమలులో ఉంటుందని 100 మీటర్ల 200 మీటర్ల పరిధిలో ఆంక్షలు ఉంటాయని తెలిపారు. గుంపులు గుంపులుగా తిరగడం పార్టీ జెండాలను పార్టీ గుర్తులను ధరించి లోపలికి వెళ్లడం ప్రదర్శించడం వంటివి చేయకూడదని తెలిపారు. మొబైల్ ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులకు పోలింగ్ కేంద్రంలోకి అనుమతి లేదని తెలిపారు. అదనపు ఎస్పీ ఆపరేషన్ బి.సురేందర్‌రావ్, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.



పోలీసులకు సూచనలు చేస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం



మాట్లాడుతున్న నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

## 144 సెక్షన్ అమలు

**నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల**

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 26 : ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్‌ను విధించడం జరిగిందన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్లుయితే డయల్ 100కు సమాచారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఉపేంద్రరెడ్డి, అవినాశ్ కుమార్, రాజేశ్ మీనన్, సీఐలు నవీన్‌కుమార్, సైదారావు, ప్రేమ్ కుమార్, నైలు, గోపినాథ్, ప్రవీణ్ కుమార్, మల్లేశ్, కృష్ణ, ఆర్ఐలు రాం నిరంజన్ రావు, శేఖర్, రమేశ్ పాల్గొన్నారు.

**పోలింగ్ కేంద్రాల సందర్శన**

జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ జానకి షర్మిల సందర్శించారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

## పంపిణీ కేంద్రం పరిశీలన

ఎదులాపురం, ఫిబ్రవరి 26 : మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల సందర్భంగా బుధవారం టీటీడీసీలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను, ఎన్నికల బ్యాలెట్ బాక్స్‌ల కోసం క్లోజ్డ్ బాడి వెహికల్స్‌లో అమర్చిన జీపీఎస్ డివైస్‌ను కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో తాగునీరు, భోజన వసతి కల్పించామని తెలిపారు. పోలింగ్ స్టేషన్‌కు వెళ్లేందుకు వాహనాలు సమకూర్చామన్నారు. బ్యాలెట్ బాక్స్‌లు తరలించేందుకు ఆరు క్లోజ్డ్ బాడి వెహికల్స్‌లో జీపీఎస్ డివైస్‌ను అమర్చామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ అభిగ్యాన్ పాల్గొన్నారు.



బ్యాలెట్ బాక్స్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా




## బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

జైనథ్, ఫిబ్రవరి 26 : దీపాయిగూడ గ్రామానికి చెందిన గంగాధరి ఊశన్న ఇటీవల మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి జోగు రామన్న బుధవారం ఊశన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ బొల్లు గంగన్న, అశోక్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

## నేడు, రేపు పత్తి కొనుగోళ్లు బంద్

ఎదులాపురం, ఫిబ్రవరి 26 : ఎమ్మెల్సీ ఎన్నికలు నేపథ్యంలో గురు, శుక్రవారాల్లో అమావాస్య ఉన్నందున పత్తి కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి గజానాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ యార్డు, సీసీఐ ప్రైవేటు వ్యాపారస్తుల వారితో కొనుగోళ్లను నిలిపివేసినట్లు పేర్కొన్నారు. మార్చి ఒకటో తేదీ నుంచి పత్తి కొనుగోళ్లు ఉంటాయని, ఈ విషయాన్ని రైతులు గమనించి సహకరించాలని కోరారు.



## బాత్రూంలో జారిపడి ఒకరి మృతి

భైంసాటౌన్, ఫిబ్రవరి 26 : బాత్రూంలో జారిపడి ఒకరు మృతి చెందిన ఘటన భైంసా మండలంలోని దేగాం గ్రామంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ మాలిక్ తెలిపిన వివరాల ప్ర కారం.. దావుల భూమేశ్(42) మంగళవారం సాయంత్రం కూ లి పనులు ముగించుకుని ఇంటికి వచ్చాడు. రాత్రి భోజనం చేసి న తర్వాత ఛాతిలో నొప్పిగా ఉందని భార్యతో చెప్పి బాత్రూం కు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. చాలా సేపటి వరకు భూమేశ్ బయటకు రాకపోయేసరికి అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు బాత్రూంలకు వెళ్లి చూడగా మృతి చెం ది ఉన్నాడు. పోలీసులకు సమాచారం అందించగా పోస్టుమా ర్టం కోసం మృతదేహాన్ని దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి కొడుకు, కూతురు ఉన్నారు.

## నీలకంఠుడికి నీరాజనం

### కనుల పండువగా మహా శివరాత్రి వేడుకలు

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో బుధవారం మహాశివరాత్రి పర్వదినాన్ని భక్తులు అత్యంత భక్తిప్రపత్తుల మధ్య జరుపుకున్నారు. ప్రధాన శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే భక్తుల సందడి కనిపించింది. భక్తులు ప్రత్యేక పూజలు, హారతులు, రుద్రాభిషేకాలు, హోమం, యజ్ఞాది కార్యక్రమాలను నిర్వహించారు. శివపార్వతుల కల్యాణ మహోత్సవం కనుల పండువగా చేపట్టారు. జాగారం, ఉపవాసం ఉండి బోళా శంకరుడిని ఆరాధించారు. నిర్వహకులు ఆలయల్లో బారికేడ్లు, షామియానాలు, తాగునీరు వంటి సౌకర్యాలను కల్పించారు. నీలకంఠుడిని దర్శించుకునేందుకు భారీ సంఖ్యలో భక్తజనం బారులుదీరింది. ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. శివలింగానికి భక్తులు పాలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు జరిపారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ మల్లికార్జున స్వామి ఆలయంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- నమస్తే నెట్‌వర్క్



ఇచ్చోడలోని సిరిచెల్మలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్